దళిత రైతుకు దగా!

రైతు సమాచార పత్రంలో ఉద్యోగిగా గుర్తింపు • సర్కారు తప్పిదం..1.92లక్షల మాఫీకి టోపీ • నిజామాబాద్ జిల్లాలో రైతుకు చేదు అనుభవం

నిజామాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆయన యువ రైతు చదివింది పీజీ అయినా వృత్తి వ్యవసాయమే. ఉద్యోగ అర్హత పరీక్ష కాదు కదా.. కనీసం దరఖాస్తు కూడా చేయలేదు. అయినా రేవంత్ సర్కారు ఘనకార్యంలో ఆయనకు ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు లభించింది. సీన్ కట్ చేస్తే సదరు రైతుకు రావాల్సిన రుణమాఫీ కాలేదు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు రొడ్డ సుమన్‌కు నాలుగు ఎకరాల సొంత వ్యవసాయ భూమి ఉన్నది. కుటుంబంలో ఆయనొక్కడే వారసుడు. దళిత కుటుంబానికి చెందిన రొడ్డ సుమన్‌కు మాక్లూర్‌లోని ఎస్‌బీఐ నుంచి రూ. 1,65,220 రుణం మంజూరైంది. డీసీసీబీ నుంచి రూ.26,801 రుణం వచ్చింది. మొత్తం రూ.1,92,021 రుణాన్ని స్వీకరించగా రైతు సమాచార పత్రంలోని రుణమాఫీ స్థితి అని పేర్కొనే 8వ నంబర్ కాలమ్‌లో కుటుంబంలో మినహాయింపులేని ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు..అంటూ నమోదు చేయడం విడ్డూరంగా మారింది. సుమన్ కుటుంబంలో రెండు రుణ ఖాతాల సంఖ్య జారీ చేయబడింది. ఆ రెండింటిలో ఏ ఒక్క ఖాతాకూ రుణ మాఫీ వర్తించలేదు. దీంతో ఏవో, ఏఈవోలను ప్రశ్నించగా రికార్డుల్లో ప్రభుత్వ ఉద్యోగిగా పేర్కొన్నట్టుగా బదులిచ్చారు. పొలం పనులు చేసుకునే తాను సర్కారు ఉద్యోగిని కావడం ఏమిటని నిట్టూర్చడమే రొడ్డ సుమన్ వంతయ్యింది. ఈ తప్పును సరిదిద్దే వారెవ్వరని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం, కాల్ సెంటర్లకు ఫోన్లు చేయడం మొదలుపెట్టారు. ఎవ్వరూ స్పందించకపోవడంతో ఓపిక నశించి పోరాటానికి సిద్ధపడ్డారు. తనకు న్యాయంగా రావాల్సిన లక్షా 92వేల 21రూపాయల పంట రుణాన్ని మాఫీ చేయండి లేదంటే ప్రభుత్వ ఉద్యోగమైనా చూపించండంటూ సర్కారును సుమన్ అడుగుతున్నాడు.

పంటరుణమాఫీ 2024
రైతు సమాచార పత్రం

రైతు సమాచార పత్రంలో ప్రభుత్వ ఉద్యోగిగా నమోదైన దృశ్యం

ఉద్యోగం ఇస్తారా? రుణమాఫీ చేస్తారా?

నేను పదిహేనేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. నా కుటుంబంలో నేను ఒక్కడినే రుణం పొందాను. ఎస్‌బీఐ, డీసీసీబీ బ్యాంకుల్లో మొత్తం రూ.1,92,021 రుణం ఉండగా మాఫీ కాలేదు. కారణం ఏమిటని అడిగితే ప్రభుత్వ ఉద్యోగివి అంటూ బదులిస్తున్నారు. నాకైతే ఆశ్చర్యమేసింది. ప్రభుత్వం సరిచేసి రుణమాఫీ వర్తింప చేయాలి. లేదంటే ప్రభుత్వ ఉద్యోగమైనా చూపించాలని కోరుతున్నాను.

- రొడ్డ సుమన్, రైతు

మాఫీకి రాజకీయ రంగు!

- **జాబితా తయారీలో అధికారపార్టీ నేతల జోక్యం!**
- **చింతలపల్లిలో 1,800 రైతుల్లో 500 మందికే మాఫీ**
- **మంత్రి జూపల్లి నియోజకవర్గంలో రుణమాఫీ సిత్రాలు**

కొల్లాపూర్, ఆగస్టు 18: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చింతలపల్లి గ్రామంలో రైతు రుణమాఫీకి రాజకీయ గండం ఎదురైంది. మంత్రి జూపల్లి కృష్ణారావుకు అత్యంత సన్నిహితంగా ఉండే కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ జాబితా తయారీలో జోక్యం చేసుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యనాయకులకు అర్హత ఉన్నా జాబితాలో పేరు రాలేదు. అధికారులను అడిగితే విస్మయానికి గురిచేసే సమాధానాలు రావడంతో రాజకీయరంగు పులుముకున్నదనే ఆరోపణలున్నాయి. చింతలపల్లిలో ప్రభుత్వం కాలపరిమితి ప్రకారం 1,800 మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉన్నారు. మొదటి విడతలో 154, రెండో విడతలో 193, మూడో విడతలో 100 మందిలోపే లబ్ధిదారులు ఉన్నట్టు తెలుస్తున్నది. మూడు విడుతలు కలిపి 500 మంది లోపే మాఫీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కొర్రీలతో కొందరికి కోత పడితే.. స్థానికంగా ఉన్న అధికారపార్టీ నాయకుల జోక్యంతో మరికొందరికి మాఫీ కాకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

జూపల్లి ఇలాకా.. రైతుకు ధోకా!

రేషన్ కార్డులేదని చేయట్లేదు..

కొల్లాపూర్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో రూ.60 వేలు పంట రుణం తీసుకున్నాను. రేషన్ కార్డులేదన్న నెపంతో కుటుంబ నిర్ధారణ చేయాలని చెప్పి నాకు రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో రోజూ బ్యాంకు, వ్యవసాయాధికారులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సాయికృష్ణ, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

ఎవరూ పట్టించుకోవడం లేదు..

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కొల్లాపూర్ బ్రాంచ్‌లో రూ.లక్ష రుణం తీసుకున్నాను. కాంగ్రెస్ వస్తే రుణమాఫీ చేస్తుందని ఆశపడ్డాను. కానీ నాకు మాఫీ కాలేదు. మాఫీ కోసం రోజు బ్యాంకు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

- శివకుమార్, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

రాజకీయ నేతల జోక్యం వల్లే..

ప్రభుత్వం ప్రకటించిన కాలపరిమితిలోనే నేను కొల్లాపూర్ సొసైటీ లో రూ.లక్షా 20 వేలు పంట రుణం తీసుకున్నాను. నాకు రేషన్ కార్డు, పాసుపుస్తకం, ఆదాయ ధ్రువీకరణ పత్రం అన్నీ ఉన్నాయి. రాజకీయ నాయకుల జోక్యంతోనే కొత్త కారణాలను సృష్టించి రుణమాఫీలో పేరు లేకుండా చేశారు. అధికారులను అడిగితే నీకు అర్హత ఉంది కానీ ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదని సమాధానం చెబుతున్నారు. రుణమాఫీని రాజకీయాలకు వాడుకుంటున్నారు.

- మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

2లక్షలు దాటినోళ్లకు రుణమాఫీ ఎప్పుడు ?

- **ఊసే ఎత్తని ప్రభుత్వం.. రైతుల్లో అయోమయం**
- **2 లక్షలపైన రుణం చెల్లించేదెట్ల?**
- **కుటుంబ రుణం వేర్వేరు బ్యాంకుల్లో ఉంటే ఎలా ?**
- **2 లక్షలు దాటినోళ్లు 20 లక్షల మంది రుణరైతులు**
- **రుణమాఫీ కావాలంటే.. మళ్లీ అప్పు చేయాల్సిందేనా!**

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ) : రూ.2 లక్షల వరకు అరకొరగా రుణమాఫీ చేసిన ప్రభుత్వం రూ.2 లక్షలకు పైగా రుణం పొందిన రైతుల పరిస్థితి ఏంటనేదానిపై స్పష్టత ఇవ్వడం లేదు. వీళ్లకు రుణమాఫీ ఎప్పటి నుంచి.. ఏ విధంగా చేస్తారనే అంశంపై స్పష్టత కొరవడింది. దీంతో 2 లక్షల వరకే మమా అనిపించేసి ఆపై రుణరైతులకు మొండి చేయి చూపిస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు ఇప్పటికే రుణమాఫీ మొత్తం పూర్తి చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మరింత ఎక్కువై అధికారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అధికారులు ఏ విషయం చెప్పలేక చేతులెత్తుస్తున్నారు.దీంతో 2 లక్షలకు దాటిన రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది.

అదనపు రుణం చెల్లించాక.. అర్హత ఉంటే రుణమాఫీ చేస్తాం

రూ. 2లక్షల రుణమాఫీపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం

హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ నిబంధనల మేరకు రూ. 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు ముందు అదనపు సొమ్ము చెల్లించాలని, ఆ తర్వాతే రైతుల అర్హతను బట్టి రుణమాఫీ చేస్తామని ఆదివారం పత్రికా ప్రకటనలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రూ. 2 లక్షలలోపు రుణమాఫీకాని రైతుల కుటుంబ నిర్ధారణ చేసిన తర్వాత వాళ్లకు కూడా చెల్లిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు రుణమాఫీపై అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో విడతల వారిగా రెండుసార్లు రూ. 28వేల కోట్లు రుణమాఫీ చేస్తే తాము ఒకేసారి రూ. 17,933 కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు.

విధివిధానాలేవీ?

ప్రభుత్వం రూ. 2 లక్షలకు పైగా రుణమాఫీకి సంబంధించి ఎలాంటి విధివిధానాలు ప్రకటించలేదు. ఈ రైతులకు సంబంధించి ఉత్తర్వుల్లో ఒకేఒక్క అంశాన్ని మాత్రమే ప్రస్తావించింది. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న కుటుంబం ముందుగా 2 లక్షలకు పైగా ఎంత రుణం ఉన్నదో ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తే ప్రభుత్వం రూ. 2 లక్షలు జమ చేస్తుందని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో 2 లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ఎలా చెల్లించాలి?, ఎప్పటి వరకు చెల్లించాలనే అంశంలో స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్లక్ష్యం చూస్తుంటే ఎగవేత ప్లాన్‌లో ఉందా అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు బ్యాంకుల్లో అప్పుంటే ఎలా?

రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాన్ని ముందుగా చెల్లించేందుకు సిద్ధమవుతున్న రైతులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రైతులకు వేర్వేరు బ్యాంకుల్లో తలా రూ.లక్ష అప్పు ఉన్నది. వీళ్ల మొత్తం అప్పు రూ.4 లక్షలు. ఇందులో వీళ్లు రూ.2లక్షలు బ్యాంకులకు ముందుగా చెల్లించాలి. అయితే తలా రూ. లక్ష మాత్రమే ఉండడంతో పైగల రూ. 2 లక్షలను ఎవరి ఖాతా కింద చెల్లించాలనే అంశంపై స్పష్టత లేదు. ఆ తర్వాత రుణమాఫీ ఎవరెవరికి అవుతుందో తెలియదు. రూ. 2 లక్షల పైన ఉన్న రుణం చెల్లించాలంటే మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పై చెప్పిన ఉదాహరణలో రైతు కుటుంబానికి రూ. 4 లక్షల అప్పు ఉంటే ఇందులో రూ. 2 లక్షల రుణమాఫీకి మరో రూ. 2 లక్షల అప్పు తెచ్చి బ్యాంకుల్లో కట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

అర్హుల సంఖ్య ఏదీ?

రూ. 2 లక్షల వరకు 22.37 లక్షల మందికి రుణమాఫీ చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం అదే విధంగా రూ. 2 లక్షలకు పైగా రుణం గల రైతులు ఎంతమంది ఉన్నారనే లెక్కల్ని ఎందుకు ప్రకటించడం లేదని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వారికి రుణమాఫీకి ఎంత మొత్తం అవుతుందో ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ లెక్కల్ని బయటకు చెప్పకపోవడంతో మళ్లీ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం రుణమాఫీ లెక్కల ప్రకారం రాష్ట్రంలో రూ.2 లక్షలకు పైగా రుణం గల రైతులు సుమారు 20 లక్షల వరకు ఉన్నారు. రుణమాఫీకి మొత్తం అర్హుల సంఖ్య 42 లక్షలుగా ప్రభుత్వం పేర్కొన్నది. ఇప్పటి వరకు 22.37 లక్షల మందికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంకా 19.63 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలో వీళ్లంతా రూ. 2 లక్షలకు పైగా రుణం పొందిన రైతుల జాబితాలో ఉండాలి.దీనిపై అధికారులు మాత్రం ఈ లెక్కలతో విభేదిస్తున్నారు. 2 లక్షల వరకు రుణమాఫీకి 22.37 లక్షల మంది అర్హులైతే... 2 లక్షలకు పైగా రుణ రైతులు 20 లక్షల మంది ఏ విధంగా ఉంటారని ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మన రాష్ట్రంలో 90శాతం రైతులు సన్నకారు రైతులే దీంతో 2 లక్షల వరకు రుణమాఫీలో రైతుల సంఖ్య అధికంగా ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా 2 లక్షల వరకు రుణమాఫీలో రైతుల సంఖ్య తగ్గి.. దీంతో సమానంగా 2 లక్షలకు పైగా రుణ రైతులు ఉండడంపై అధికారుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అదనపు రుణం చెల్లింపు ఎందుకు...?

రూ. 2 లక్షలు రుణమాఫీ కావాలంటే ఆ పై రుణం ముందుగా చెల్లించాలనే నిబంధనపై రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కండీషన్ పెట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వం ఎంత రుణమాఫీ చేయదల్చుకుందో ఆ మొత్తం చేయకుండా రైతులతో లింకు పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని రైతుల బాధ్యతకు వదిలేయాలి గానీ ఇప్పుడే చెల్లించాలంటూ పీకల మీద కత్తిపెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిబంధనతో రైతులు మళ్లీ అప్పుల కోసం ప్రైవేటు వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారని తెలిపారు. ఒక్కొక్కరు రూ. 5 అంతకు మించి వడ్డీతో అప్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. రైతులు అంత చేస్తున్నా ప్రభుత్వం నుంచి 2 లక్షలకు పైగా రుణమాఫీ ఎప్పుడు చేస్తారో స్పష్టత లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

బీసీలు మందుకు ఆశపడ్తరు

మొదటిపేజీ తరువాయి...

కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. మల్లన్న మాట్లాడుతుండగా ఓ వ్యక్తి లేచి అందుకే రెడ్డిలెవరూ ఈ సభకు రాలేదని అన్నారు. అలా అనొద్దని ఆ వ్యక్తిని కొందరు వారించారు. దాంతో తీన్మార్ మల్లన్న కలుగజేసుకొని ఆ వ్యక్తి చెప్పిన మాటలను తప్పు పట్టొద్దని, ఈ సభకు వారు నిజంగానే రావొద్దని అన్నారు. గౌడ్‌లు అడుక్కునే వారు కాదని, ఒకప్పుడు ఈ దేశాన్ని ఏలిన వారని కొనియాడారు. వెలమలు, రెడ్డిలు ఇచ్చే మందుకు ఆశ పడి బీసీలు ఓట్లను అమ్ముకుంటున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అదే బీసీలు వెలమ, రెడ్డి ఓట్లను మందుతో కొనగలరా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ పోరాట పటిమతో బీసీలంతా ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఒక్క బీసీ అయినా ముఖ్యమంత్రి అయ్యిండా అని ప్రశ్నించారు. బీసీల నుంచి బీర్ల అయిలయ్య కూడా ముఖ్యమంత్రి పదవికి అర్హుడేనని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బీసీలకు మంత్రి పదవి ఇవ్వాలని, అందుకు తాను రాహుల్ గాంధీకి లేఖ రాయనున్నట్టు తెలిపారు.

అల్లుడా.. మజాకా?

మొదటిపేజీ తరువాయి...

సంస్థ ఆయిల్‌ఫెడ్‌తో పాటు మరో 14 కంపెనీలున్నాయి. ఈ కంపెనీల్లో ఒకటి ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. ఈ కంపెనీకి 2021లో ఏడు జిల్లాలు నిర్మల్, నిజామాబాద్, సిరిసిల్ల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, ఆదిలాబాద్ జిల్లాలు కేటాయించారు. సుమారు 40 వేల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కల్ని నాటించింది. ఇప్పుడిప్పుడే గెలల కాత మొదలైంది. ఈ సమయంలో కంపెనీని కబ్జా చేసేందుకు ఓ మంత్రి మేనల్లుడు, కొడుకు కలిసి స్కెచ్ వేసినట్టు తెలిసింది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వంలో పెద్దస్థాయిలో చర్చ జరగ్గా ఇందుకు ఆ శాఖ ఉన్నతాధికారి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. అలా చేయడం కుదరదని తేల్చిచెప్పినట్టు తెలిసింది. అయినా సదరు మంత్రి బంధువులు మాత్రం తీవ్ర ఒత్తిడి చేస్తూ వారి ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నట్టు సమాచారం.

తెలంగాణ భవన్‌లో పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, పల్లె రవి, బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులు

బడుగు వీరులకు గొడుగు పట్టింది కేసీఆరే

- **మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల లక్ష్మయ్య**
- **ఏదేని జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**
- **కేసీఆర్ హయాంలో గౌడన్నలకు చేయూత**
- **సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి**


సిరిసిల్లలోని పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేటీఆర్

హైదరాబాద్/మహబూబ్‌నగర్ అర్బన్/సిద్దిపేట టౌన్/రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): బడుగువీరులకు గొడుగు పట్టింది కేసీఆరేనని బీఆర్ఎస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 374వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి మాజీ మంత్రులు వీ శ్రీనివాస్ గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు పల్లె రవికుమార్, ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రామమూర్తి, రాంనర్సింహ గౌడ్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని గతంలో ఎవరూ నిర్వహించలేదని, తెలంగాణం సాధించిన తరువాత కేసీఆర్ బడుగు, బలహీనవర్గాల వీరులకు, త్యాగధనులకు సముచి గౌరవం ఇచ్చారని చెప్పారు. సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ సహా అనేకమంది త్యాగధనుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. సర్వాయి పాపన్న విగ్రహానికి నిధులు కేటాయించారని, ట్యాంక్‌బండ్‌పై, అసెంబ్లీ ప్రాంగణంలోనూ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాన్యులందరూ సమానత్వంతో బతకాలని తన జీవితాన్ని పోరాటంగా మలచుకొన్న సర్వాయి పాపన్న ఆదర్శ ప్రాయుడని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సర్వాయి పాపన్న జయంతిలో పాల్గొన్నారు. మొదటి బైపాస్‌రోడ్డులోని నర్సింగ్ కళాశాల చౌరస్తాలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యం కోసం, తెలంగాణపై నిరుంకుశ శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న పేరును జనగామ లేదా మరే జిల్లాకైనా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వాయి పాపన్న ఆశయాలను సాధించే దిశగా గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని గౌడన్నలకు తాటి, ఈత చెట్ల పన్నులు, గతంలో ఉన్న బకాయిలన్నింటినీ పూర్తి స్తాయిలో మాఫీ చేసిందని గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేసీఆర్ హయాంలో గౌడ కులస్థులకు చేయూత అందిస్తే.. కాంగ్రెస్ సర్కారు గీత కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నదని ఆరోపించారు.

పర్యాటక ప్రాంతంగా పాపన్నగౌడ్ జన్మస్థలం

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రకటన

రవీంద్రభారతి, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ఆదర్శనీయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌గౌడ్ కొనియాడారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు వర్గాలకు రాజ్యాధికారం దక్కాలని చేసి చూపిన పాపన్నగౌడ్ జీవితం తమ ఇందిరమ్మ రాజ్యానికీ ఆదర్శమని పేర్కొన్నారు. పాపన్నగౌడ్ పుట్టిన ఖిలాషాపూర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.4.70 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. పాపన్న జీవిత చరిత్రపై రూపొందించిన పాకెట్ బుక్‌ను ప్రతి గ్రామంలో పంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

పోడు పట్టాలను చూపిస్తున్న భద్రాద్రి జిల్లా చింతల్‌తండా గిరిజనులు

160లో 35 మందికే మాఫీ

- **చింతల్‌తండాలో తీరని రుణమాఫీ**
- **గ్రామంలోని గిరిజన రైతులకు రిక్త'హస్తం'**
- **జాబితాలో 70 శాతానికి పైగా పేర్లు గల్లంతు**
- **బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తామంటున్న రైతులు**

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (నమస్తేతెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం చింతల్ తండా ఓ మారుమూల పల్లె. 85 కుటుంబాలున్న ఈ గ్రామంలో అందరూ రైతులే. గ్రామ పరిధిలో 160 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. వారిలో కేవలం 35 మందికే కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేసింది. మూడు విడతలు కలిపి 30 శాతం మంది రైతులకు కూడా మాఫీ కాలేదు. వీరిలో ఒక్కొక్కరి పంట రుణాలూ రూ.1.04 లక్షలలోపే ఉండటం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ నూరుశాతం కాలేదనడానికి ఈ చిన్న గ్రామమే ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తున్నది. రుణమాఫీ మీద గంపెడాశలు పెట్టుకున్న గ్రామ అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం రిక్త'హస్తాన్నే' మిగిల్చింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ రైతుబంధు, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాలు అందిన ఈ గ్రామంలో.. రేవంత్ సర్కారు వచ్చీ రాగానే మొండి 'చేయి' చూపిందని స్థానిక రైతులు చెప్తున్నారు. మూడు విడతల్లోనూ 70 శాతానికి పైగా పేర్లు రాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులనూ కలిసి వాకబు చేయగా, 'పేర్లు రానప్పుడు మేమేం చేయాలి?' అంటూ వారు సమాధానమిచ్చారు. దీంతో అయోమయంలో ఉన్న వారు రుణాలు తీసుకున్న బ్యాంకు వద్ద ఆందోళనకు దిగాలని నిర్ణయించుకున్నారు. ధర్నా చేసైనా తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు రైతులు తెలిపారు.

బ్యాంకుల చుట్టూ తిరగాలా?

వ్యవసాయ సీజన్ మొదలైందని, పంటలన్నీ అదునుమీద ఉన్నాయని చింతల్‌తండా రైతులు పేర్కొంటున్నారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులు, సొసైటీల వద్దకు పరుగులు తీయడం తప్పడం లేదు. దీంతో పంటలు సాగు చేసుకోవాలా? బ్యాంకుల చుట్టూ తిరగాలా? అంటూ గ్రామ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీ కింద భద్రాద్రి జిల్లాలో 57,983 మంది రైతులకు రూ.415 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని, ఇన్ని నిధులు మంజూరైనా గత కేసీఆర్ సర్కారు రైతుబంధు కింద ఒక సీజన్‌కు ఇచ్చినంత మొత్తం కూడా లేదని విమర్శిస్తున్నారు.

అందరికీ లక్షలోపు రుణాలే.. ఎందుకు మాఫీ కాలే?

మా ఊరికి అధికారులొస్తే పట్టా పుస్తకాలు. బ్యాంకు పాస్‌బుక్‌లు చూపిస్తాం. అందరికీ పోడు పట్టాలున్నాయి. కేసీఆర్, వైఎస్సార్ అందించినవీ ఉన్నాయి. అందులోనూ అందరికీ రూ.లక్ష లోపు పంట రుణాలే. అయినా మా అప్పు ఎందుకు మాఫీ కాలేదు? అధికారులు మా దగ్గరకు వచ్చి చూడాలి? మేము అర్హులమో కాదో తేల్చిచెప్పాలి?

-తేజావత్ రమేశ్, చింతల్‌తండా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా